క్లుప్తంగా

ట్రిబుల్ ఐటీ విద్యార్థినికి చేయూత

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం ఎన్నెస్పీ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన ఎస్.రమ్యశ్రీ ఉపాధ్యాయుడు యలమద్ది వెంకటేశ్వర్లు అండగా నిలిచారు. ఈమేరకు ఆరేళ్ల విద్యాభ్యాసానికి అయ్యే రూ.30 వేలు అందజేసేందుకు ముందుకొచ్చారని హెచ్‌ఎం ఎం.శంకర్‌రావు, ఎస్‌ఎంసీ చైర్మన్ రాధాకృష్ణ తెలిపారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో తొలి విడతగా రూ.5వేలను రమ్యశ్రీ, ఆమె తల్లిదండ్రులకు అందజేశారు. ఉపాధ్యాయులు పూనాటి వెంకటేశ్వర్లు, జి.రామ్మూర్తి, బి.శ్రీరామ్మూర్తి, రమణ రాజు, ఉస్మాన్‌అలీ, బ్రహ్మం, జయపాల్ పాల్గొన్నారు.

పాఠశాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



ఆర్థికసాయం అందజేస్తున్న కార్పొరేటర్

ఖమ్మంఅర్బన్: నగరానికి చెందిన పేద విద్యార్థిని వేదగిరి జూహిత ఉన్నత చదువుల కోసం పాఠశాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.5 వేల ఆర్థిక సాయం కార్పొరేటర్ కూరాకుల వలరాజు అందించారు. కళ్యాణపు త్రినాథ్ తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ శ్రీ మహాలక్ష్మమ్మ శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ పునర్నిర్మాణానికి పలువురు సోమవారం విరాళాలు అందజేశారు. కైకొండాయగూడెంకు చెందిన బండి దినేష్ లక్ష్మీప్రసన్న దంపతులు రూ.5,116, మిర్యాలగూడెంకు చెందిన వనమా రవికుమార్ నాగలక్ష్మి దంపతులు రూ.5,116 విరాళం అందించారు. దాతల సహకారంతో పనులు శర వేగంగా సాగుతున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నేలకొండపల్లి: విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన ఘటన మండలంలోని రాజారంపేటలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంటు వెంకటేశ్వరరావు తన గేదెను మేతకు వదిలాడు. ఈ మేరకు ప్రమాదవశాత్తు ఓ రైతు పొలంలో ఉన్న విద్యుత్ స్తంభం సపోర్టు తీగ గేదెకు తగలడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. గేదె విలువ రూ.70 వేలు వరకు ఉంటుందని తనకు పరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరుకుంటున్నాడు.

కూలీలను అడ్డుకున్న జీపీ కార్మికులు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి, చెరువుమాధారం, అప్పల నరసింహాపురం, ముజ్జుగూడెం గ్రామాల్లో సోమవారం దినసరి కూలీలు పారిశుద్ధ్య పనులు చేస్తుండగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువురు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు షేక్ రహిముతుల్లా మాట్లాడుతూ.. ప్రభుత్వం దిగిరాకపోతే ఈ నెల 5న అసెంబ్లీ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వంగూరి నాగరాజు, ఉపేందర్, బుచ్చిరాములు, నగేష్, బొడ్డు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వరదలతో రూ.20 లక్షలు నష్టం

ఖమ్మంరూరల్: వరదలతో విద్యుత్ శాఖకు ఏదులాపురం సెక్షన్‌లో రూ.20లక్షలు ఆస్తినష్టం సంభవించినట్లు ఏఈ క్రాంతిసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 విద్యుత్ స్థంభాలు విరిగిపోగా, 31 ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయని పేర్కొన్నారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా ఇచ్చినట్లు తెలిపారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	166	బచ్చలికూర	2
వంకాయ	46		10
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	100		20
కాకర	80	చుక్కకూర	3
బీర	66		20
దొండ	26	తోటకూర	2
పొట్లకాయ	66		10
చిక్కుడు	64	గోంగూర	2
గోరుచిక్కుడు	50		10
క్యాబేజీ	24	మెంతికూర	2
క్యాలీఫ్లవర్	50		10
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	46		20
క్యారెట్	56	పుదీన	1
క్యాప్సికం	80		20
దోస	50	-ఖమ్మం వ్యవసాయం	

రియల్‌గా ముంచారు..

'మున్నేరు నది అయితే ఏంటి.. మీకు ఎటువంటి ఇబ్బంది ఉండదు.. ఇంత పైకి వరద రాదు.. వరదను తట్టుకునేందుకు గోడను నిర్మించాం.. ఎక్కడికి వెళ్లినా ఇంతకంటే తక్కువ ధరకు మీకు స్థలం దొరకదు' అనే మాయమాటలు విన్న పేదలు నిండా మునిగారు. రియల్ వ్యాపారులు చెబుతున్న మాటలనే నమ్మి వాస్తవాలు గ్రహించలేక నదికి అతి సమీపంలో బఫర్‌జోన్‌లో గూడు కోసం ఆరాట పడి స్థలాలు కొనుగోలు చేసి ఇప్పుడు వరదలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ నగరంలోని మున్నేరు పరీవాహక ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టిన వారి పరిస్థితి.



కూలిపోయిన మున్నేరు ఒడ్డున నిర్మించిన గోడ

మున్నేరు ఒడ్డునే అక్రమంగా వెంచర్లు
- పేదలకు మాయమాటలతో అంటగట్టిన వ్యాపారులు
- ప్రమాదమని తెలిసీ ఇళ్ల నిర్మాణాలు
- సర్వం కోల్పోయిన పలువురు బాధితులు



వరద తాకిడికి పూర్తిగా నేలమట్టమైన ఇల్లు



కూలిపోయిన ఇంటి గోడలు

ఖమ్మంమయూరిసెంటర్: ఈనెల 27న మున్నేరుకు వచ్చిన వరదకు నదీ పరివాహక ప్రాంతమంతా మునిగిపోగా.. ఆయా కాలనీ వాసులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పునరావాస కేంద్రాలకు తరలిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముందు ముందు కూడా ఇదే పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

నదికి సమీపంలోనే..

రియల్ వ్యాపారులు నదికి అతి సమీపంలో.. ఒడ్డున అనేక వెంచర్లను నిర్మించారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు లేనప్పటికీ అధికారులను మచ్చిక చేసుకుని ఇళ్ల నిర్మాణాలకు అనుమతులను తీసుకొస్తున్నారు. పేదలకు అనుమతులున్నాయని, ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉండొచ్చని చెబుతూ ముంపులోకి నెట్టేస్తున్నారు. అనేక నిర్మాణాలు నది ఒడ్డునే చేపడుతున్నా అధికారులు కన్నెత్తి చూడలేదు. కొన్నిచోట్ల నదికి అతి సమీపంలోనే నిర్మించారు.

కలెక్టర్ ఆగ్రహం..

అధికారుల అలసత్వంతో బీటీ రోడ్లు నిర్మాణాలు చేసి వెంచర్లలో ప్లాట్లను విక్రయిస్తున్నారు. సోమవారం కలెక్టర్ వీపీ గౌతమ్ మోతీనగర్‌లో పర్యటించిన సందర్భంగా బఫర్‌జోన్‌లో బీటీ రోడ్ల నిర్మాణాలను చూసి రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్‌జోన్‌లో బీటీ రోడ్లు వేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతుంటే మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిని బట్టి రియల్ వ్యాపారులు పేదలను ఎలా వంచించారో తెలుస్తుంది.

నిండా మునిగి..

ఎన్నో కలలతో నిర్మించుకున్న ఇళ్లను మున్నేరు వరద ముంచేసింది. తలదాచుకునేందుకు చిన్న గూడు నిర్మించుకునేందుకు అనేక మంది వీధి వ్యాపారులు, కూలీలు మున్నేరు ఒడ్డున లక్షల రూపాయలు వెచ్చించి ఖాళీ స్థలాలను, నిర్మించి ఉన్న ఇళ్లను కొనుగోలు చేశారు. ఏడాది నుంచి ఐదేళ్ల లోపు ఈ ప్రాంతంలో ఇళ్లు కొనుగోలు చేసి నివాసం ఉంటున్నవారే ఎక్కువ మంది. వీరికి గతంలో వరదల తాకిడిపై పెద్దగా అవగాహన లేకపోవడం, ఏటి ఒడ్డున గోడ నిర్మించి ఉండడంతో తమకు ఎలాంటి ప్రమాదం జరగదనే కొనుగోలు చేసి జీవిస్తున్నారు. ఇటీవల ఒక్కసారిగా వచ్చిన భారీ వరదతో ఆ ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. ఇక కొందరి ఇళ్లల్లో సామగ్రి అంతా నీటిలో కొట్టుకపోయింది. ఇంటిలోని వస్తువులు, డబ్బులు, బంగారం వంటివి అన్ని నీటిలో కొట్టుకపోవడంతో ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో బాధితులు ఉన్నారు. గూడు కోసం ఆశతో మాయ మాటలు నమ్మి నిండా మునిగిపోయామంటూ ఆవేదన చెందుతున్నారు.

వరద రాదంటే నమ్మి స్థలం కొన్నా



చుట్టూ గోడ ఉంది, ఇక్కడకు నీళ్లు రావు, వరద వచ్చినా పెద్దగా ఇబ్బంది ఉండదంటే నమ్మి స్థలం కొనుగోలు చేసి చిన్న ఇళ్లు నిర్మించుకున్నా. ఒక్కసారిగా వచ్చిన వరదతో ఇళ్లు, ఇంటిలో ఉన్న సామాను కొట్టుకపోయింది. కట్టుబట్టలతో రోడ్డుపై ఉన్నా. కూరగాయల గంపతో చిరువ్యాపారం చేసుకుని జీవిస్తున్న నన్ను ఈ వరదులు పూర్తిగా ముంచేశాయి.

– నాగినబోయిన కనకదుర్గ, బాధితురాలు మోతీనగర్, ఖమ్మం

గూడు ఆశతో మునిగిపోయాం



ఉండేందుకు చిన్న ఇళ్లు కావాలనే ఆశతో రూ.10 లక్షలు పెట్టి ఏటిఒడ్డున 107 గజాలలో ఇంటిని గొనుకోలు చేశాం. వరదలు రావు, ఏమి కాదనే ధైర్యం చెప్పడంతో ఉన్న కొద్ది నగదును వెచ్చించి ఈ ఇంటిని నిర్మించుకున్నాం. వరద వస్తుందంటే ఇద్దరు కొడుకులను వెంట బెట్టుకొని కట్టుబట్టలతో బయటకు పోయాం. వరద తగ్గిన తర్వాత వచ్చి చూస్తే ఇళ్లు, ఇంటిలోని సామాను కనిపించలేదు. డబ్బులు, బంగారం వరదలోనే కొట్టుకపోయాయి.

– మామిడాల అరుణ, ఉపేందర్, మోతీనగర్,

ఇళ్లు కోల్పోయాం ఆదుకోండి..



ఇళ్లు కట్టుకోవాలనే ఆశతో నేను, నా బిడ్డ ఇద్దరం కూలీ చేసి దాచుకున్న డబ్బులతో స్థలం కొనుక్కొని చిన్న పాటి ఇళ్లను నిర్మించుకున్నాం. రాత్రికిరాత్రి వచ్చిన వరదతో ఇళ్లను పూర్తిగా కోల్పోయాం. నా కూతురు ఇళ్లు పూర్తిగా నేలమట్టమైంది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– సీహెచ్.నర్సమ్మ, మోతీనగర్

బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం



డీసీసీ అధ్యక్షుడికి నివేదిక ఇస్తున్న తిలక్

ఖమ్మంసహకారనగర్: కాంగ్రెస్ వైరా నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న యర్రం బాలగంగాధర్‌తిలక్ మండల ఇన్‌చార్జ్‌లతో కలిసి పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించారని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. ఈమేరకు నివేదికను సోమవారం ఆయన అందజేయగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేస్తూ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. నాయకులు కూరపాటి కిషోర్, వేముల కృష్ణప్రసాద్, బానోత్ రామ్మూర్తి, మాటూరి కృష్ణారావు, కిలారు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కళ్ల కలకలం!

నేలకొండపల్లి: ప్రస్తుతం చిన్నాపెద్ద తేడా లేకుండా పలువురు కళ్లకలకతో ఇబ్బంది పడుతున్నారు. ఇది ఒకరి నుంచి మరొకరికి సోకుతుండగా.. ప్రధానంగా పాఠశాలలు, కళాశాలల వసతి గృహాల్లో ఎక్కువగా వ్యాప్తి చెందుతోంది. బాధితుల కళ్లు ఎర్రబారి నీరుకారుతుంటాయి. కొందరికి కంటి రెప్పలు ఉబ్బి ఉంటున్నాయి. అలాగే, పూర్తిగా ఊసులతో కళ్లు మూసుకుపోతుండడంతో అవస్థ పడుతున్నారు. హాస్టళ్లు, విద్యాసంస్థల్లో ఒక విద్యార్థి కళ్ల కలక రాగానే మిగతా వారికి వ్యాపిస్తుందనే భావనతో ఇళ్లకు పంపిస్తున్నారు. నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం, నేలకొండపల్లి వసతి గృహాలకు చెందిన కొందరు విద్యార్థులను ఇప్పటికే ఇంటికి పంపించారు. ఈ విషయమై నేలకొండపల్లి సీహెచ్‌సీ వైద్యాధికారి కె.రాజేష్ మాట్లాడుతూ సీజనల్ వచ్చే కళ్ల కలకతో ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపారు. అయితే, ఇతరులకు వ్యాప్తి చెందకుండా కళ్లద్దాలు పెట్టుకోవడంతో పాటు చుక్కల మందు నాలుగు గంటలకోసారి వేసుకోవాలని సూచించారు.

వరద బాధితులకు పరిహారం చెల్లించాలి



ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరదతో నష్టపోయిన కుటుంబాలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ బృందం ముంపు ప్రాంతాల్లో పాదయాత్ర చేసి, జరిగిన నష్టాన్ని బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్‌కు బాధితుల తరుపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముంపు ప్రాంతాల ప్రజలు దయనీయ పరిస్థితులలో ఉన్నారన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.లక్ష పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఎల్లంపల్లి వెంకట్రావు, యర్రా గోపి, నాయకులు సుదర్శన్, బండారు యాకయ్య, షేక్ ఇమామ్, సారంగి పాపారావు, ఖాసీం, పున్నయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా..

వరదలకు తీవ్రంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిప్రకాష్, కోలా లక్ష్మీనారాయణ, ఖాసిం, కార్యదర్శి మోహన్ రావు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పలు డిమాండ్లపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద ఈ నెల 8న నిర్వహించే చలోఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి కోరారు. సోమవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... బీసీలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి కేంద్ర స్థాయిలో బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని డిమాండ్‌చేశారు. నాయకులు డాక్టర్ గుండు హరికిషోర్ గౌడ్, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సత్యనారాయణ, హనుమంతు, నాగేశ్వరరావు, మాధవ, సాయిశేషు పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

చలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు రాంమూర్తి ఒక సమావేశంలో కోరారు. రామాచారి, చంద్రయ్య, రమేష్, పుల్లయ్య, రమణకుమార్, సుగుణ, శ్రీనివాస్ ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

నేలకొండపల్లి: వర్షాలకు, వరదలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రావెళ్ల భవన్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి, వరి తో పాటు ఇతర పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. దళిత బంధు, మైనార్టీ, బీసీ రుణాలు రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ రచ్చా నరసింహారావు, ఏటుకూరి రామారావు, వెంకటేశ్వర్లు, బెల్లం లక్ష్మి, పగిడికత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

ఖమ్మంవైద్యవిభాగం: వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యాన విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశముండడంతో విద్యాసంస్థల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం డీఎంహెచ్‌ఓ బి.మాలతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు కళ్లకలక, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున విద్యాసంస్థలు, వసతి గృహాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, కార్తీక్, శ్రీకాంత్, నరేందర్, వినయ్, కరుణ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



విద్యార్థులతో ఫౌండేషన్ సభ్యులు, నాయకులు

ఖమ్మంరూరల్: మండలంలోని దారేడు, పడమటి తండా, పోలిశెట్టిగూడెం, మద్దివారిగూడెంలలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కందాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేట్లు, గ్లాసులు ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ సోమవారం పంపిణీ చేశారు. అదే విధంగా ఇటీవల మృతి చెందిన 9 మంది కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 10వేలు చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం. వేణు, ఏనుగు. ధర్మారెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

తీజ్ వేడుకల్లో..

కూసుమంచి: తమ స్వగ్రామం రాజుపేట గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ, కుమార్తె దీప్తి పాల్గొన్నారు. గిరిజనులతో కలిసి సాంప్రదాయ నత్యాన్ని చేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు



పతకాలతో డీపీఎస్ విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం నిర్వహించిన హైదరాబాద్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించారు. ఈ మేరకు అండర్–12, 14 విభాగాల్లో 34 మంది పతకాలు సాధించారని పాఠశాల యాజమాన్యం కదారి రవీంద్రరెడ్డి, గండికోట శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ కొత్తూరు స్వప్న తెలిపారు. విద్యార్థుల్లో డి.తన్వి, ఎండీ.అబ్బాస్, బి.ప్రావీణ్య, ఎం.డీ.మలీహా తదితరులు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించగా వీరితో పాటు కోచ్ ఎం.సాయిరేఖను సోమవారం అభినందించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మం లీగల్: ఏపీలోని ప్రకాశం జిల్లా అద్దంకికి చెందిన న్యాయవాది విశల్‌బాబును హత్య చేయడాన్ని నిరసిస్తూ ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు ఆధ్వర్యాన అత్యవసరంగా సమావేశమై విధులు బహిష్కరించాలని నిర్ణయించారు. ఈసందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు పెరుగుతున్న నేపథ్యాన రక్షణ కోసం చట్టం తీసుకురావాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మన్నెపల్లి బసవయ్యతో పాటు కొల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరామర్శ



విద్యార్థిని పరామర్శిస్తున్న నాయకులు

ఖమ్మం వైద్యవిభాగం: పాలేరు జవహర్ నవోదయ ఘటనలో గాయపడి ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు విద్యార్థులను సోమవారం బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అల్లిక వెంకటేశ్వరరావు యాదవ్ పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులతో పనులు చేయించడం దారుణమని, ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ జనరల్ సెక్రటరీ జె.లింగయ్య ఉన్నారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



పోస్టుకార్డులతో నాయకులు, జర్నలిస్టులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి కెసీఆర్ జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం ఖమ్మంలో చేపట్టిన పోస్టు కార్డు ఉద్యమాన్ని ఆయన ప్రారంభించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, నాయకులు శివానంద, వెంకట్రావు, సామినేని కృష్ణమురారి, మైసా పాపారావు,శ్రీనివాస్, మోహీనుద్దీన్, జనార్థనాచారి, మురళీ, నామా పురుషోత్తం పాల్గొన్నారు.

నేలకొండపల్లి: జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా సహాయ కార్యదర్శి పోలంపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డులు పంపించారు. ఈ కార్యక్రమంలో పీ.వీ.నాగిరెడ్డి, రేగూరి శ్రావణ్‌కుమార్, తోళ్ల బుచ్చాలు, యం.ఉపేందర్, ఆంజనేయులు, పీ.వీ.సాగర్, సైదులు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, ఆదాం, పసుమర్తి శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

కూసుమంచి: టీయూడబ్ల్యూజే (ఏజేయూ) పిలుపులో భాగంగా కూసుమంచిలో జర్నలిస్టులు పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ మేరకు మండలకేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద ముఖ్యమంత్రికి రాసిన లేఖలను పోస్ట్ చేశారు.

వర్గీకరణ సాధనలో విద్యార్థులే కీలకం



మాట్లాడుతున్న సోమశేఖర్

నేలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణ సాధనలో విద్యార్థులు కీలకంగా మారాలని మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీలో సోమవారం ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో హైదరాబాద్‌లో జరిగే మాదిగుల విశ్వరూప సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘం పాలేరు డివిజన్ కమిటి ఇన్‌చార్జ్‌గా పగిడికత్తుల వినయ్‌ను ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ రఘువరన్, నాయకులు జశ్వంత్, నాగభూషణం, ఇన్‌చార్జ్ తోళ్ల సురేష్, వడ్లమూడి వెంకటేశ్వర్లు, హరిష్, కిశోర్, రాజేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 3వ డివిజన్ జయనగర్ కాలనీకి చెందిన బాణోత్ పార్వతి ఇటీవల మృతి చెందిగా సోమవారం దశదిన కర్మకు హాజరైన టీఆర్‌ఎస్ నాయకుడు చిరుమామిళ్ల రవికిరణ్ బాధిత కుటుంబానికి పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. మంగు, నంద్యా, రామకృష్ణ, వీరన్న, ఉపేందర్ ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఖమ్మంరూరల్: మండలంలోని రాజీవ్ గృహకల్పలోని వరద బాధితులకు కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో సోమవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. మద్దినేని స్వర్ణకుమారి, అజ్మీరా అశోక్‌నాయక్, గోనె భుజంగరెడ్డి, సూదగాని. ఉపేందర్, ఏనుగు మహేష్, భద్రకాళి, కళ్యాణ్, నగేష్, రవి పాల్గొన్నారు.

జలగంనగర్, పెదతండాలలో మున్నేరు వరద బాధితులకు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ సరుకులు పంపిణీ చేశారు. నాయకులు తేజావత్ పంతులనాయక్, మద్ది మల్లారెడ్డి, తోట వీరభద్రం, కొమ్మూరి రమేష్, పసుపులేటి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మిత్రా గ్రూప్ ఆధ్వర్యంలో..

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంగాంధీచౌక్: మిత్రా గ్రూప్ కురివెళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో 35వ డివిజన్‌లో వరద బాధితులకు బియ్యం, నిత్యావసరల సరుకులు పంపిణీ చేశారు. మిత్రా గ్రూపు చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, రామ్మోహన్‌రావు, మాటేటి నాగేశ్వరరావు, మాటేటి కిరణ్‌కుమార్, బాలిని శ్రీను, కేశగాని రవి పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

ఖమ్మంమయూరిసెంటర్: మణిపూర్‌లో ఆదివాసీ మహిళల అమానవీయ నగ్న ఊరేగింపునకు బాధ్యత వహించి ఆ రాష్ట్ర సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్, జిల్లా సహాయ కార్యదర్శి బొట్లా సాగర్, సైదులు, భిక్షం, వీరభద్రం, శాంతయ్య, కిరణ్ ఉన్నారు.

ఇంకా వరద మురుగులోనే..



కేబీఆర్ నగర్‌లో పేరుకుపోయిన బురద

ఖమ్మంరూరల్: ఎడతెరిపి లేని వర్షాలతో మున్నేరుకు వరద ఉధృతి పోటెత్తి ముంపు బాధితులు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. అయితే, వరద ఉధృతి శనివారం తగ్గినా పలువురి ఇళ్లను బురద వీడలేదు. దీంతో స్థానికులు మురుగు నీరు, బురద తొలగిస్తూ శుభ్రం చేసుకునే పనిలో నిమమగ్నమయ్యారు. మండలంలోని పెదతండా పరిధిలోని జలగంనగర్, నాయుడుపేట, కేబీఆర్‌నగర్, కరుణగిరి, రాజీవ్‌గృహకల్ప కాలనీల్లో ఈ పరిస్థితి ఉంది. అయితే, పారిశుద్ధ్య పనులు తూతూ మంత్రంగానే చేపడుతుండడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక మున్నేటి వరదలతో కేబీఆర్ నగర్, జలగంనగర్, రాజీవ్‌గృహకల్ప, కరుణగిరిల్లోని పలువురి ఇళ్లల్లోకి విషపురుగులు, పాములు చేరడంతో ఆందోళన చెందుతున్నారు. తాజాగా ఓ బాలుడు పాముకాటుతో మృతి చెందిన నేపథ్యాన వారి ఆందోళన పెరుగుతోంది.